క్లుప్తంగా

నక్షబాట సర్వే చేసిన అధికారులు



చారకొండ: మండలంలోని జూపల్లి నుంచి తాండ్రకు వ్యవసాయ పొలంలోకి వెళ్లేందుకు ఉన్న నక్షబాట కబ్జాకు గురైందని, బాట లేక రైతులు ఇబ్బందులు పడుతున్నామని జూపల్లి, తాండ్రకు చెందిన రైతులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో సోమవారం ఆర్‌ఐ నబి, సర్వేయర్ శ్రీదేవి నక్షబాట సర్వే చేసి హద్దు రాళ్లను సరి చూశారు.

మిషన్ భగీరథ కార్మికుల వేతనాలు పెంచాలి

నాగర్‌కర్నూల్ రూరల్: మిషన్ భగీథలో పనిచేస్తున్న కార్మికుల వేతనాలను ప్రభుత్వం పెంచాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శివశంకర్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కార్యాలయంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పథకం కింద పనిచేస్తున్న వేలాదిమంది కాంట్రాక్ట్ కార్మికులకు తక్షణమే కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 27న ఈసీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. జిల్లావ్యాప్త సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఎక్సైజ్ కార్యాలయంలో వాహనాల వేలం

కొల్లాపూర్: పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయం వద్ద సోమవారం సీఐ ఏడుకొండలు సమక్షంలో వాహనాల వేలంపాట నిర్వహించారు. మొత్తం 6 వాహనాలకు రూ.1,31,596 ఆదాయం వచ్చినట్లు సీఐ పేర్కొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

కందనూలు: త్రైతసిద్ధాంతం ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని నల్లవెల్లిరోడ్డులోని పలు కాలనీలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. అధ్యక్షుడు మనోహర్ మాట్లాడుతూ.. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలను ప్రచారం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సాయి శంకర్ శ్రేష్ఠి, ఉషన్న, నిరంజన్, వెంకటమ్మ, జంగిలయ్య, నరేష్, శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

అచ్చంపేట రూరల్: పట్టణ డిపో ఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు డీఎం రాజశేఖర్ సోమవారం తెలిపారు. ఉదయం 9:30నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు శిబిరం ఉంటుందని, ఆర్టీసీ ఉద్యోగులు, కుటుంబ సభ్యులు, వారి స్నేహితులు, కళాశాలల విద్యార్థులు అందరూ పాల్గొని రక్తదానం చేయాలని కోరారు. వారికి ధ్రువపత్రాలు ఇస్తామని పేర్కొన్నారు.

నాగర్‌కర్నూల్ సీఐగా విష్ణువర్ధన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ క్రైం: నాగర్‌కర్నూల్ సీఐగా విష్ణువర్ధన్‌రెడ్డిని నియమిస్తున్నట్లు సోమవారం సాయంత్రం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈయన పదోన్నతిపై సీఐగా బదిలీపై వస్తున్నారు. ప్రస్తుతం సీఐగా పనిచేస్తున్న జక్కులహన్మంతును సంగారెడ్డి జిల్లా కంగటికి సర్కిల్‌కు బదిలీ చేశారు.

కల్వకుర్తి సీఐగా ఆంజనేయులు

కల్వకుర్తి టౌన్: కల్వకుర్తి సీఐగా ఆంజనేయులు నియమితులయ్యారు. మల్టీజోన్-2లో వెయిటింగ్‌లో ఉన్న ఆయనకు ఇక్కడ పోస్టింగ్ ఇస్తూ ఐజీ ఇచ్చిన ఉత్తర్వులలో పేర్కొన్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన సీఐ పార్థసారధిగౌడ్‌కు డీఎస్పీగా పదోన్నతి లభించటంతో ఏర్పడిన ఖాళీలో ఆయన నియమితులయ్యారు. డీఎస్పీగా పదోన్నతి పొందిన ప్రస్తుత సీఐ డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేశారని సమాచారం. అతనికి కల్వకుర్తిలో పోస్టింగ్ వచ్చే అవకాశాలున్నాయని తెలిసింది.

బస్సుయాత్రను జయప్రదం చేయండి

నాగర్‌కర్నూల్‌రూరల్: పేదలకు ఇళ్లు, స్థలాలను పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ ఐక్యపోరాట వేదిక ఆధ్వర్యంలో చేపడుతున్న బస్‌యాత్రను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు సోమవారం ప్రకటనలో పిలుపునిచ్చారు. మంగళవారం బస్సుయాత్ర జిల్లా కేంద్రానికి చేరుకుంటుందని, ఈ సందర్భంగా పట్టణంలో సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

వెల్దండ: మండలంలోని చొదర్‌పల్లికి చెందిన దొబ్బల శివలీలకు ప్రభుత్వం సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరు చేసిన రూ.16వేల చెక్కును సోమవారం ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ హైదరాబాదులోని ఆయన నివాసంలో అందజేశారు. కార్యక్రమంలో జయప్రకాష్, యాదగిరి, మహేష్ తదితరులు ఉన్నారు.

యువత మత్తుకు బానిసకావొద్దు

అచ్చంపేట రూరల్: డ్రగ్స్‌ను నియంత్రించడాన్ని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని ఆర్డీఓ పాండునాయక్ అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ కృష్ణయ్యతో కలిసి యాంటి డ్రగ్స్ పోస్టర్లను విడుదల చేశారు. యువకులు చెడుదారిన వెళ్లకుండా జాగ్రత్త పడాలని చెప్పారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయం ఆవరణలో మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, ఐసీడీఎస్ సీడీపీఓ దమయంతి తదితరులు పోస్టర్లను విడుదల చేశారు.



అచ్చంపేటలో పోస్టర్లను విడుదల చేస్తున్న అధికారులు

తెలకపల్లి: యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దని తహసీల్దార్ కృష్ణయ్య అన్నారు. సోమవారం మండల కాంప్లెక్స్ కార్యాలయం వద్ద తహసీల్దార్ ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ నేటి ఆధునిక సమాజంలో యువత మత్తు పదార్థాలకు, మాదక ద్రవ్యాలకు బానిస అవుతున్నారని, విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భాస్కర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ, ఏపీఎం నిరంజన్, ఎంపీఓ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపూర్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం మిషన్ పరివర్తన పోస్టర్‌లను రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు ఆవిష్కరించారు. ఆర్డీఓ హన్మనాయక్, తహసీల్దార్ శివశ్రీనివాస్. వెంకటరమణ, ఉద్యోగులు పాల్గొన్నారు.

వెల్దండ: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మిషన్ పరివర్తన పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి పత్యనాయక్, డీటీ శ్రీను, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శ్రీమతి, శంకరమ్మ, అశ్విని, ఏపీఎం రాములు, ఏఈ తిరుపతి నాయక్ పాల్గొన్నారు.

తాడూరు: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సోమవారం మిషన్ పరివర్తన్ వాల్‌పోస్టర్‌ను డీటీ మహముద్‌అలీ విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాలను వాడటం వలన యువత చెడు వ్యసనాలకు గురి అవతుందని, వాటిని మానివేస్తే జీవితం సుఖమయంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంగామోహన్, ఏఓ సాయిరమేష్‌కుమార్, ఏఈ చెంతన్‌తేజ పాల్గొన్నారు.

చారకొండ: నేటి సమాజంలో మత్తుకు అలవాటు పడి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని డీటీ విద్యాధరి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం పోస్టర్‌ను తహసీల్దార్ కార్యాలయంలో విడుదల ఆర్‌ఐ మంజుల, వెటర్నరి అసిస్టెంట్ మాధర్, ఏపీఎం బాలచందర్ పాల్గొన్నారు.

కల్వకుర్తి: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీఓ రాజేష్‌కుమార్ పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి వెంకటలక్ష్మి, పీడీపీఓ వెంకటమ్మ, తహసీల్దార్ రాంరెడ్డి పాల్గొన్నారు.

కోడేరు: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని తహసీల్దార్ మల్లికార్జున్‌రావు సూచించారు. సోమవారం కార్యాలయంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శోభారాణి ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిర్మూలన పోస్టర్లను విడుదల చేశారు.


తెలకపల్లిలో..


తాడూరులో..


చారకొండలో..

గుడిసెలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దుతాం


గ్రామస్తులతో మాట్లాడున్న వెంకటేష్

కల్వకుర్తిరూరల్: నియోజకవర్గంలో గుడిసెలు లేని గ్రామాలను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ అన్నారు. సోమవారం మండలంలోని పంజుగులలో పర్యటించారు. గుడిసెలలో నివాసం ఉంటున్న 10 కుటుంబాలకు ఇళ్లు నిర్మిస్తానని హామీ ఇచ్చి ఆ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గ్రామంలో ట్రస్టు ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. రాబోయే రోజుల్లో నిరుపేదలకు ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి వారికి అండగా ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ నిర్మల, శంకర్, గణేష్, శశికుమార్‌గౌడ్, దివాకర్ గౌడ్, ఎంపీపీ మనోహర పాల్గొన్నారు.

ఐకేపీ లావాదేవీలపై ఆడిట్


ఆడిట్ నిర్వహిస్తున్న అధికారులు

తెలకపల్లి: మండల కేంద్రంలోని స్త్రీ శక్తి భవనంలో సోమవారం ఐకేపీ సంఘాలలో చేపట్టిన లావాదేవీలకు సోమవారం నాగర్‌కర్నూల్ ఆడిట్ అధికారులు శేఖర్‌రెడ్డి, శివ రికార్డులు, పుస్తకాలు, లావాదేవీలు ఆడిట్ చేశారు. అడిషనల్ డీఆర్‌డీఓ లక్ష్మీనారాయణ పరిశీలించారు. మండలంలోని 30 గ్రామ సంఘాలకు సంబంధించిన సమావేశ పుస్తకం, పుస్తక నిర్వహణ, నగదు పుస్తకం, లోన్‌పుస్తకం, డీసీబీ ఆడిట్ రిపోర్ట్ చూశారు.

ఈద్గా వద్ద ఏర్పాట్ల పరిశీలన


ఈద్గా వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కల్పన

కందనూలు: ముస్లింలు బక్రీదును భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కల్పన తెలిపారు. జిల్లా కేంద్రంలోని శ్రీపురం రోడ్డులో గల ఈద్గాను సోమవారం మున్సిపల్ వైస్ చైర్మన్ బాబురావు, కమిషనర్ జయంత్ కుమార్‌రెడ్డి, కౌన్సిలర్లతో కలిసి ఆమె పరిశీలించారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. ప్రార్థనలకు వచ్చే వారికి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాలుగా మున్సిపల్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. కౌన్సిలర్లు ఖాజాఖాన్, ఇసాక్ నాయకులు ఉన్నారు.

హరితహారానికి మొక్కలు సిద్ధం చేయాలి

తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాలలోని నర్సరీలోని మొక్కలను జూలై 2 నుంచి నిర్వహించే హరితాహారానికి సిద్ధం చేయాలని ఎంపీడీఓ గంగామోహన్ సూచించారు. సోమవారం మండల కేంద్రంతోపాటు తిరుమలాపూర్ నర్సరీని పరిశీలించారు.

వెల్దండ: హరితహారంలో నాటిన మొక్కల పెంపకంపై కార్యదర్శులు ప్రత్యేక దృష్టి ఉంచాలని, ప్రతి మొక్కను రక్షించుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని రాఘయపల్లి, పోతేపల్లి, నారాయణపూర్‌లో పర్యటించారు. ఉపాధి కూలీలతో గుంతలను ఏర్పాటు చేసి సిద్ధంగా ఉంచాలన్నారు. మొక్కలు సక్రమంగా నాటించాలన్నారు.

లింగాల: వర్షాలు కురుస్తున్న సమయంలో హరితహారంలో మొక్కలను నాటే పనులను యుద్ధ ప్రాతిపదిక నిర్వహించాలని ఎంపీడీఓ గీతాంజలి పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. సోమవారం మండలంలోని దారారం, మగ్దూంపూర్‌లో పర్యటించిన ఎంపీడీఓ మొక్కలను నాటే పనులను పరిశీలించారు. 19 నుంచి మండలంలోని అన్ని పంచాయతీలలో హరితహారంలో భాగంగా మొక్కలను నాటే పనులు చురుకుగా కొనసాగుతున్నాయని తెలిపారు.

మైనార్టీలను మోసం చేస్తే సహించేది లేదు

కందనూలు: మరోసారి మైనార్టీలను మోసం చేసేందుకే ఈద్గా, మసీదుల నిర్మాణానికి రూ.3కోట్ల50లక్షల నిధులను మంజూరు చేస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ప్రకటించి ప్రొసిడింగ్‌లు ఇస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు హబీబ్ ఆరపించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రొసిడింగ్‌లతో సరిపెడితే కుదరదని, టెండర్లను ఆహ్వానించి పనులను ప్రారంభించాలన్నారు. గతంలో కూడా ఈద్గా నిర్మాణానికి రూ.35లక్షలు, దర్గా నిర్మాణానికి రూ.7 లక్షల మంజూరు చేసినట్లు ప్రకటించి ఓట్లను దండుకున్న తర్వాత అధికారంలోకి వచ్చి ఇంతవరకు వాటిని ప్రారంభించలేదన్నారు. 12 శాతం రిజర్వేషన్లు ప్రకటిస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలో మైనార్టీలకు 4శాతం రిజర్వేషన్లను అమలు


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

చేసి విద్యా, ఉద్యోగం ఉపాధి రంగాలలో ఎన్నో అవకాశాలను కల్పించిందని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని, వాటిపై ఎమ్మెల్యే నోరు మెదపాలని డిమాండ్ చేశారు. మెడికల్ కళాశాల, ఎస్పీ, కలెక్టర్ కార్యాలయ నిర్మాణాలకు దళితుల భూములను ఎంపిక చేయడం దారుణమని చెప్పారు. భూ నిర్వాసితులకు భూములకు బదులు భూములు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో తైలి శ్రీనివాసులు, భాస్కర్, గౌస్ పాల్గొన్నారు.

అక్రమంగా పశువులను తరలిస్తే కఠిన చర్యలు

వెల్దండ: అక్రమంగా పశువులను ఇతర ప్రాంతాలకు తరలిస్తే చట్టరీత్య చర్యలు తీసుకుంటామని పశువైద్యాధికారి శ్యాంసుందర్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కొట్రగేట్ చెక్‌పోస్టు వద్ద డాక్టర్ శ్యామ్‌సుందర్ పోలీసులతో కలిసి వాహనాలను పరిశీలించారు. నిజమైన రైతులు పశువులను తీసుకెళ్తె ఖచ్చితంగా కొనుగోలు చేసిన రశీదు, అడ్రస్ ఉండాలన్నారు. గ్రామాల్లో గుర్తు తెలియని వ్యక్తులు కనిపించినా, రైతులకు ఎలాంటి సమాచారం ఉన్న పోలీసులకు తెలపాలన్నారు.

ఐక్యత ఫౌండేషన్ సభ్యుల సంబరాలు



వెల్దండ: మండల కేంద్రంలో ఐక్యత ఫౌండేషన్ సభ్యులు సోమవారం రాత్రి టపాసులు కాల్చి సంబరాలు నిర్వహించారు. ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరడంతో హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రమేష్‌నాయక్, కొండల్‌యాదవ్, పంతునాయక్, కిమ్యానాయక్ తదితరులు ఉన్నారు.

కల్వకుర్తిరూరల్: ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరడంతో ఆయన అభిమానులు, నాయకులు పట్టణంలోని సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో నిజాముద్దీన్, రంజిత్‌రెడ్డి, శ్రీపతిరాజు, గణేష్, రమేష్, శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో కనీస వసతులు కరువు

లింగాల: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చందు ఆరోపించారు. ఏబీవీపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు సోమవారం నిర్వహించిన పాఠశాలల బంద్ డివిజన్‌లో చేపట్టినట్లు తెలిపారు. పాఠశాలల బలోపేతం విషయంలో ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటుందని, వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయని తెలిపారు. ఇప్పటి వరకు పాఠ్య పుస్తకాలు పూర్తి స్థాయిలో సరఫరా కాలేదని, మౌలిక వసతులు లేవన్నారు. ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలల్లో ప్రభుత్వం అధిక ఫీజులను నియంత్రించలేక పోతుందని అన్నారు.

కందనూలు: ప్రభుత్వం ఏర్పడి దశాబ్ద కాలం గడిచినా ప్రాథమిక నుంచి ఉన్నత పాఠశాల వరకు పూర్తిగా విద్యను నిర్వీర్యం చేసిందని ఏబీవీపీ నగర కార్యదర్శి కార్తిక్ ఆరోపించారు. సోమవారం పట్టణంలో పలు పాఠశాలలను బంద్ చేయించారు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో కనీసం వసతులు లేవని 6,600 ప్రాథమిక పాఠశాలలో ఒకే టీచరు ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో చరణ్, సాయి, జయపాల్, శివ తదితరులు పాల్గొన్నారు.

వెల్దండ: మండల కేంద్రంలో సోమవారం మండల ఏబీవీపీ కార్యవర్గం ఆధ్వర్యంలో విద్యాసంస్థలను మూసివేయించారు. వారు మాట్లాడుతూ అధిక ఫీజులు వసులు చేస్తున్న విద్యాసంస్థలపై చర్యలు


లింగాలలో మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు

తీసుకోవాలన్నారు. ఖాళీగా పోస్టులను భర్తీ చేసి విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉమేష్, పవన్, చరణ్, చంటి, వంశీ, నందు, హరీష్, నాగరాజు, సందీప్, భరత్, మధు తదితరులు ఉన్నారు.

లింగాల: విద్యా వ్యవస్థలో లోపాలను సరి చేయాలని, ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజుల నియంత్రించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో పాఠశాలల బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలు ప్రారంభమైన కొద్ది సేపటికే ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు తరగతులను బహిష్కరించారు. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని ఏబీవీపీ నాయకులు విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ మండల ప్రధాన కార్యదర్శి దాసరి యాదయ్య, సలేశ్వరం, శ్రీను, మహేష్, విష్ణు పాల్గొన్నారు.

పరిహారం చెల్లించాలి

కొల్లాపూర్: నేషనల్ హైవే 167కేలో భాగంగా కొల్లాపూర్ సమీపంలో నిర్మించనున్న బైపాస్ రహదారిలో ప్లాట్లు కోల్పోతున్న వారికి నష్టపరిహారం చెల్లించాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. సోమవారం ఆర్డీఓ హనుమనాయక్‌కు వినతిపత్రం అందజేశారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని వినతి

కందనూలు: పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ప్రజావాణిలో డీఆర్‌డీఓ నర్సింగరావుకు వినతి అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. మొదటి పీఆర్‌సీ సిఫార్సులను అనుగుణంగా పెన్షనర్ల మూలవేతనం నుంచి ఒక శాతం మినహాయించి పూర్తిస్థాయిలో ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ అమలు పరచాలన్నారు. పెన్షనర్ల నుంచి కమ్యూటేషన్ ద్వారా మినహాయించిన మొత్తాలను 15 సంవత్సరాలకు ఇస్తున్నారని, అలా కాకుండా 12 సంవత్సరాలకు కాలానికి తగ్గించి తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. నెలల తరబడి ఈ కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించడంతో పాటు, పెన్షన్లను ప్రతినెల మొదటి తేదీ రోజే చెల్లించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్లకు కనీస పెన్షన్ రూ.30వేలుగా నిర్ణయిస్తే బాగుంటుందని పేర్కొన్నారు. అంతకుముందు సంఘం నాయకులు ర్యాలీగా కలెక్టరేట్‌కు వచ్చారు.


కలెక్టరేట్ వద్ద మాట్లాడుతున్న నాయకులు

కార్యక్రమంలో శ్రీధర్, బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి, యుగంధర్, వెంకటశెట్టి, శ్రీనివాసులు, ప్రభాకర్, రామిరెడ్డి, పాండురంగయ్య, వెంకటరాజు, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేట రూరల్: ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వరంలో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వినితిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో నరేందర్‌రెడ్డి, ప్రభాకర్, కోశాధికారి కుమారస్వామి పాల్గొన్నారు.

అధిక ఫీజుల దోపిడీ అరికట్టండి


మాట్లాడుతున్న బీసీ సంఘం నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: పట్టణంతోపాటు జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ విద్యా సంస్థల యజమానులు అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లేష్‌గౌడ్ ఆరోపించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. అనుమతులు లేకుండా 20 నుంచి 30 శాతం ఫీజులను పెంచుతూ వసూలు చేస్తున్నారని, అడ్మిషన్ ఫీజు, పుస్తకాలు, యూనిఫామ్స్, బస్‌చార్జీలు, టై, బెల్టు, బూట్ల పేరుతో అదనంగా వసూలు చేస్తున్నట్లు విమర్శించారు. విద్యాహక్కు చట్టాన్ని దుర్వినియోగం చేస్తూ దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. పాఠశాలల వద్ద ఆటస్థలం, అగ్నిమాపక పరికరాలు లేకపోయినప్పటికీ, మౌలిక వసతులు కల్పించకుండానే అధిక ఫీజులు వసూలు చేయడంతో అధికారులు నోరు విప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రవీందర్‌గౌడ్, లక్ష్మయ్య, వెంకటేశ్వర్లు, నిరంజన్‌యాదవ్, శ్రీనివాస్, సుధాకర్‌గౌడ్, శ్రీను పాల్గొన్నారు.

ఇళ్లు కట్టుకోనివ్వకుంటే పోరాడుతాం

అచ్చంపేట రూరల్: పేదలకు ఇచ్చిన స్థలాల్లో వారికే ఇళ్లు కట్టుకోనివ్వాలని గిరిజన సంఘం మండల అధ్యక్షుడు హరీష్‌నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని బ్రాహ్మణపల్లిలో ప్రజాసంఘాల ఐక్యవేధిక ఆధ్వరంయలో గతంలో పేద ప్రజలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 1987లో బ్రాహ్మణపల్లిలో ఎస్టీ, బీసీలకు సర్వే నంబర్ 10లో 40మంది నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ప్రభుత్వం ఇచ్చిందని తెలిపారు. ఈ స్థలాల్లో ఇళ్లు కట్టుకునేందుకు లబ్ధిదారులు సిద్ధంగా ఉన్నా కొంత మంది అడ్డుకుంటున్నారని చెప్పారు. సమస్య పరిష్కారం కోసం తహసీల్దార్, స్థానిక ఎమ్మెల్యే వద్దకు వెళ్లినా పరిష్కారం కావడం లేదని, వారికి ఇచ్చిన స్థలాల్లో గుడిసెలు వేసుకునేందుకే సిద్ధమవుతున్నారని తెలిపారు. లబ్ధిదారులకు ఇచ్చిన స్థలాలు వారికి ఇవ్వకపోతే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మల్లేష్, లక్ష్మణ్, మంత్రియా, బాలు తదితరులు ఉన్నారు.


ఇళ్ల స్థలాలను పరిశీలిస్తున్న నాయకులు

టికెట్ ఇవ్వకపోతే రాజీనామా చేస్తాం


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

పెద్దకొత్తపల్లి: కొల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ టికెట్ జగదీశ్వర్‌రావుకు కేటాయించకుంటే మూకుమ్మడిగా రాజీనామా చేస్తామని మండల నాయకులు హెచ్చరించారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం నాయకులు బాలపీరు, విష్ణువర్ధన్‌రెడ్డి, రామస్వామి, కొండల్‌రావు, రాజేందర్ రెడ్డి, బక్కలయ్య సమావేశమై మాట్లాడారు. నియోజకవర్గంలో పార్టీ చావుబ్రతుకులో ఉన్న సమయంలో ఊరూరా తిరుగుతూ జగదీశ్వర్‌రావు పార్టీకి జీవం పోశారని తెలిపారు. మధ్యలో పార్టీలో చేరుతున్న జూపల్లి కృష్ణారావుకు టికెట్ ఇస్తే తామంతా రాజీనామా చేసి వెళ్లిపోతామన్నారు. పార్టీ గెలిచి కృష్ణారావు మంత్రి పదవులు అనుభవించి, పార్టీని సర్వనాశనం చేసిన వ్యక్తిని మళ్లీ ఎందుకు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. కార్యక్రమంలో గులాం రసూల్, ఎంపీటీసీ దళారి ఖాజా, కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

సాహూ మహారాజ్‌కు ఘన నివాళి

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని అమరవీరుల స్థూపం ఎదుట బీఎస్పీ ఆధ్వర్యంలో సోమవారం సాహూ మహారాజ్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీనివాస్‌యాదవ్ పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ దేశంలోని బడుగుబలహీన వర్గాల ప్రజలకు రిజర్వేషన్లు మొదటిసారి కల్పించిన గొప్పవ్యక్తి అని కొనియాడారు. అన్ని పార్టీలు బహుజనులను ఓటు బ్యాంకుగా చూస్తున్నాయని, బీఎస్పీ ఒక్కటే అణగారిన వర్గాలకు రాజ్యాధికారం దక్కాలని కోరుకుంటుందన్నారు. దేశంలో బీసీ కుల గణన చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చందు, కొండల్‌యాదవ్, శ్రీశైలం, మల్లేష్, రాజు, మహేష్ పాల్గొన్నారు.

కోడేరు: మండల కేంద్రంలోని బస్టాండ్‌లో బీఎస్పీ మండల అధ్యక్షుడు దేవరపాగ దర్గస్వామి ఆధ్వర్యంలో సాహూ మహారాజ్ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కృష్ణ, శంకర్, వాసు, దానయ్య తదితరులు పాల్గొన్నారు.


నివాళులు అర్పిస్తున్న బీఎస్పీ నాయకులు

కొల్లాపూర్: సాహూ మహరాజ్ జయంతిని సోమవారం బీఎస్పీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో చిత్రపటానికి వారు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జిల్లా అధ్యక్షుడు కారంగి బ్రహ్మయ్య మాట్లాడుతూ సాహూ మహరాజ్, అంబేడ్కర్, పూలే వంటి మహనీయులను స్ఫూర్తిగా తీసుకుని బహుజన రాజ్యాన్ని స్థాపిద్దామన్నారు. కార్యక్రమంలో విష్ణుతేజ, సత్యనారాయణగౌడ్, ప్రకాష్, దాసు, విష్ణు, కురుమయ్య తదితరులున్నారు.

నిధులు దుర్వినియోగం చేస్తే చర్యలు

చారకొండ: జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా మంజూరైన నిధులు దుర్వినియోగం చేస్తే చర్యలు తీసుకుంటామని అడిషనల్ డీఆర్‌డీఓ రాజేశ్వరి అన్నారు. మండలంలోని మర్రిపల్లిలో ఎంఆర్‌సీ కార్యాలయంలో సోమవారం ఉపాధి హామీ నిధుల ఖర్చుపై రెండో విడత సామాజిక తనిఖీ మండల ప్రజాప్రవేదిక సమావేశం నిర్వహించారు. మండలంలో 2020–23 వరకు చేపట్టిన పనులపై వారం రోజులగా 17 గ్రామాల్లో పనులు, కూలీల పూర్తి వివరాలను అందజేశారు. మూడేళ్లుగా 1,534 మంది కూలీలకు, మెటీరియల్‌కు కలిపి రూ. 8,45,34,162 నిధులు అందినట్లు ఆడిట్‌లో వివరాలను తెలిపారు. అధికంగా కూలిలు చెల్లించినట్లు గుర్తించారు. మండలంలో రికవరీ, పెనాల్టి కలిపి రూ.1,17,472 అయినట్లు తెలిపారు. సమావేశంలో ఎంపీపీ నిర్మల, ఎంపీడీఓ జయసుధ, ఎంపీఓ వెంకటేష్, ఏపీఓ లక్ష్మయ్య, సర్పంచ్‌లు విజేందర్‌గౌడ్, నరేష్ నాయక్, కార్యదర్శులు, అధికారులు ఉన్నారు.


ప్రజావేదిక సమావేశంలో అధికారులు